క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు


ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలను నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్ర నామాలతో పూజలు, సాయంత్రం భజనలు, రాత్రి పల్లకిసేవ గావించారు. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

ముగిసిన గ్రామోత్సవం



ముత్తుకూరు : క్రిస్మస్ పర్వదినం సందర్భంగా మండలంలోని పంటపాళెంలో బుధవారం రాత్రి తలపెట్టిన జీసస్ గ్రామోత్సవం గురువారం తెల్లవారుజామున ముగిసింది. స్థానిక క్యాథలిక్ చర్చి నుంచి ప్రత్యేకంగా అలంకరించిన శకటంపై జీసస్ ప్రతిమను అమర్చి పంచాయతీలోని పలు ప్రాంతాల్లో ఊరేగించారు. ప్రత్యేక మేళతాళాలు, బాణసంచా వేడుకల మధ్య సాగిన గ్రామోత్సవంలో స్థానికులు పాల్గొని ప్రార్థనలు చేశారు.

ముత్తుకూరులో సీపీఐ ఆవిర్భావ దినోత్సవం


కమ్యూనిస్టు పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పార్టీ నేతలు

ముత్తుకూరు : భారత కమ్యూనిస్టు పార్టీ అజేయమైనదని సీపీఐ జిల్లా నాయకుడు తుంగా ఏడుకొండలు అన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ముత్తుకూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద సీపీఐ జెండాను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కమ్యూనిస్టు పార్టీ పేదల హక్కుల కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడుతోందన్నారు. పార్టీని మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. కొమారి నందయ్య, వెంకటరమణయ్య, కాకి వెంకటశేషయ్య, రొయ్యల బాబు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు


ప్రత్యేక పూజల్లో భక్తులు

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం తెల్లవారుజామున ధనుర్మాస పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గోవింద నామస్మరణతో దేవస్థానం మార్మోగింది.

కోదండరాముని సేవలో చిన్న ఆండవన్‌స్వామి



బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెంలోని కోదండ రామస్వామిని శ్రీరంగం అరవక్కోటై 11వ పీఠాధిపతి చిన్న ఆండవన్ స్వామి గురువారం దర్శించుకున్నారు. తొలుత ఆయనకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి, అర్చకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పీఠాధిపతి ఆలయంలోని సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామికి పూజలు చేశారు.

ప్రజలపై సర్దు‘పోటు’

- చలికాలంలోనూ షాక్ కొడుతున్న విద్యుత్ బిల్లులు
- వినియోగం తగ్గినా పెరుగుతున్న మొత్తం
- సర్దుబాటు చార్జీల పేరిట బాదుడు

కూటమి ప్రభుత్వంలో ప్రజలకు అష్ట కష్టాలు తప్పడం లేదు. ఇచ్చిన హామీలను పట్టించుకోకుండా ప్రజలను దోచుకోవడంలో ప్రభుత్వ పెద్దలు అన్ని విద్యలు ప్రదర్శిస్తున్నారు. అందులో భాగంగా విద్యుత్ బిల్లుల బాదుడును ప్రజలపై మోపారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని నమ్మబలికిన చంద్రబాబు.. ప్రస్తుతం సర్దుబాటు చార్జీల పేరిట యూనిట్‌పై సరాసరిన రూ.1.50 మేర బాదుడుకు సిద్ధమయ్యారు.



పొదలకూరు : సర్వేపల్లి నియోజకవర్గంలో విద్యుత్ బిల్లుల మోత మోగుతోంది. చలికి వణుకుతున్న ప్రజలు ఫ్యాన్లు కూడా సక్రమంగా వినియోగించకపోయినా విద్యుత్ బిల్లులు షాక్ కొడుతున్నట్టు వాపోతున్నారు. నవంబరు, డిసెంబరులో అందజేసిన బిల్లులను పరిశీలిస్తే కొందరు గతనెలలో తక్కువ యూనిట్లు వినియోగించినా అధిక బిల్లులు వచ్చినట్టు తెలిపారు. ట్రూ అప్ చార్జీల పేరుతో అదనంగా ఒక్కో బిల్లుపై వచ్చిన మొత్తాన్ని బట్టి రూ.40 నుంచి రూ.80 వరకు కలుపుతున్నారు. ఇక సక్రమంగా బిల్లులు చెల్లించని వారుంటే సర్‌చార్జీలతో అవి ఇవి కలిపి తడిచి మోపెడు అవుతున్నట్లు వాపోతున్నారు. ఏసీలు ఉన్న వినియోగదారులు చలికాలం కావడంతో వాటిని వాడడం లేదు. అయినా వేలల్లో బిల్లులు వస్తున్నట్టు చెప్పారు.

సర్వేపల్లి నియోజకవర్గంలో..

సుమారు 95,028 గృహ అవసరాల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. సరాసరి 10 లక్షల యూనిట్ల వరకు విద్యుత్‌ను వినియోగిస్తున్నారు.

కోవూరు నియోజకవర్గంలో..

సుమారు 1,23,056 గృహ అవసరాల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. సరాసరి 19 లక్షల యూనిట్ల వరకు విద్యుత్‌ను వినియోగిస్తున్నారు.

పోరుబాటకు ప్రజల మద్దతు

కరెంట్ చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ శుక్రవారం పోరుబాటకు పిలుపునిచ్చింది. దీనికి ప్రజలు సైతం ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు ప్రకటిస్తున్నారు. తక్షణమే గృహ వినియోగంపై మోపిన రూ.15,545 కోట్ల అదనపు బాదుడును విరమించుకోవాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా విద్యుత్ చార్జీల పెంపును నిలిపివేయాలని, ఎస్టీ, ఎస్సీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. సర్వేపల్లి నియోజకవర్గ కేంద్రం వెంకటాచలంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పోరుబాటకు నాయకత్వం వహిస్తున్నారు.




నవంబర్, డిసెంబర్ నెలలో వచ్చిన విద్యుత్ బిల్లులు

ఈ ఫొటోలోని విద్యుత్ బిల్లు పొదలకూరు మండలం మొగళ్లూరు గ్రామానికి చెందిన పేద కుటుంబం వెంకయ్యకు చెందింది. అక్టోబరులో 119 యూనిట్లు వాడిన విద్యుత్‌కు సంబంధించి నవంబరు నెలలో రూ.528 బిల్లు వచ్చింది. నవంబరులో వాడిన 120 యూనిట్ల విద్యుత్‌కు సంబంధించిన డిసెంబరు నెలలో రూ.626 బిల్లు వచ్చింది. అంటే ఇంచుమించు ఒక నెలలోనే రూ.100 బిల్లు పెరిగింది. కూటమి ప్రభుత్వం వస్తే కరెంట్ బిల్లులు పెరగవని ఇచ్చిన హామీలు నీటిమూటలైంది.

ప్రజల పక్షాన నిలబడతాం



కూటమి ప్రభుత్వ అస్తవ్యస్త పాలనపై ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తాం. విద్యుత్ బిల్లులను విపరీతంగా పెంపొందించి, జనవరిలో మరో అదనపు భారం ప్రజలపై మోపేందుకు సిద్ధంగా ఉన్నారు. దీనివల్లే మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం విద్యుత్ బిల్లుపై పోరుబాటకు సిద్ధపడ్డాం. ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటాం. వెంకటాచలంలో నిర్వహించే పోరుబాటకు అన్నివర్గాల ప్రజలు మద్దతు ప్రకటించాలి.

– కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

బాబువి బూటకపు హామీలు

బుచ్చిరెడ్డిపాళెం : ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలను పెంచబోమంటూ చంద్రబాబు ఇచ్చిన హామీలు అంతా బూటకమనే విషయం తేటతెల్లమైందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. తక్షణమే గృహ వినియోగదారులపై మోపిన చార్జీల బాదుడును వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలన్నారు.


ప్రసన్నకుమార్‌రెడ్డి

రైతులకు అందుబాటులో ఎరువులు

- ఏఓ వాసు

పొదలకూరు : మండలంలోని రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచామని, రైతు సేవా కేంద్రాలు, సహకార పరపతి సంఘం, ప్రైవేటు దుకాణాల వద్ద కొనుగోలు చేయవచ్చని ఏఓ ఎ.వాసు తెలిపారు. పట్టణంలోని ఎరువుల దుకాణాలను ఏడీఏ కె.శివనాయక్ పర్యవేక్షణలో గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఎరువుల కొరత లేదన్నారు. డీలర్ల వద్ద అన్నిరకాల ఎరువులను నిల్వ ఉంచామని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాల్సిందిగా ఆదేశించినట్టు తెలిపారు. ఏఈఓ, వీఏఏలను ఎరువులు ఉన్న దుకాణాల వద్ద ఉంచామన్నారు. ఎరువులు కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం లేదా 1–బీ సర్టిఫికెట్, రిజిస్టర్ డాక్యుమెంట్, ఆధార్‌కార్డు, సీసీఆర్సీ కార్డు లేదా వీఆర్వో సర్టిఫికెట్, పంటల నమోదు సర్టిఫికెట్ వంటి ధ్రువీకరణలతో ఎరువులను కొనుగోలు చేయాల్సిందిగా పేర్కొన్నారు. అధిక ధరలకు విక్రయించే డీలర్ల వివరాలు వెల్లడిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.


ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

- కోవూరు : మండలంలోని పలు ఎరువుల దుకాణాలను ఏఓ ఇందిరావతి గురువారం తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే 80 శాతం నాట్లు పూర్తయిందన్నారు. ప్రస్తుతం ఎరువుల దుకాణాల్లో యూరియా రైతులకు అందుబాటులో ఉందన్నారు.

వీఎస్‌యూలో వీర్ బాల్ దివస్

వెంకటాచలం : మండలంలోని కాకుటూరు వద్ద నున్న వీఎస్‌యూలో వీర్ బాల్ దివస్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ వీర బాలల ధైర్య సాహసాలను, దేశభక్తిని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. వీర్ బాల్ దివస్ ప్రాముఖ్యత గురించి విద్యార్థులు పూర్తిస్థాయిలో తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్. విజయ, ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

మనుబోలు : రీసర్వే వల్ల భూ సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ సుబ్బయ్య అన్నారు. మండలంలోని పిడూరు గ్రామంలో రీసర్వేపై గురువారం ఆయన రెవెన్యూ సిబ్బంది, రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన గ్రామసభలో మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని భూ సమస్యలు రీసర్వేతో తొలగిపోతాయన్నారు. పొలాల్లో హెచ్చుతగ్గులు, గట్ల తగాదాల సమస్యలు సమసిపోతాయన్నారు. ఈ ర్యాలీలో మండల సర్వేయర్ శ్రీనివాసరావు, సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, వీఆర్వో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్ సుబ్బయ్య

సమస్యలుంటే తెలియజేయాలి


కొడవలూరు : తలమంచిలో అధికారుల క్షేత్ర సందర్శన


తోటపల్లిగూడూరు : పొట్లపూడి గ్రామంలో..

కొడవలూరు : యూరియా కొనుగోలులో ఏమైనా సమస్యలుంటే కాల్ సెంటర్‌కు తెలియజేయాలని ఏఓ లక్ష్మి రైతులకు సూచించారు. మండలంలోని దామేగుంట, తలమంచి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె తలమంచిలో మాట్లాడుతూ యూరియా కొనుగోలులో రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా దుకాణాల వద్ద వ్యవసాయశాఖ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఎమ్మార్పీకే యూరియాను విక్రయించాలని దుకాణదారులను ఆదేశించినట్లు వివరించారు. ఇతర ఎరువులను కొనుగోలు చేస్తేనే యూరియా ఇస్తామంటే కాల్ సెంటర్ నంబర్ 83310 57182కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డీసీ వెస్ చెర్మన్ జొన్నా శివకుమార్, ఏఈఓ పి.వెంకట్రావు, సర్పంచ్ వై.భాస్కర్‌రావు, వీఏఏలు బి.లిఖిత, ఎన్.ప్రసాద్‌లు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

తోటపల్లిగూడూరు : మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చని మండల ఏఓ శిరీషారాణి సూచించారు. మండలంలోని పొట్లపూడి, కొత్తపాళెం గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రబీ సీజన్‌కు సంబంధించి రైతులకు యాజమాన్య పద్ధతులు లాభసాటిగా మారుతుందన్నారు. విత్తన శుద్ధి చేపడితే వరిసాగులో చీడపీడలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో వీఏఏలు అనూష, ఝాన్సీ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ పోరుబాట

వెంకటాచలం : కూటమి ప్రభుత్వంలో విద్యుత్ చార్జీల బాదుడుపై సర్వేపల్లి నియోజకవర్గ కేంద్రమైన వెంకటాచలంలో మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమం జరుగుతుంది. ఉదయం 10 గంటలకు కసుమూరు క్రాస్‌రోడ్డు వద్ద నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వరకు రాలీ ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని వెంకటాచలం, మనుబోలు, పొదలకూరు, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరుకానున్నారు.

- బుచ్చిరెడ్డిపాళెం : మండల కేంద్రమైన బుచ్చిరెడ్డిపాళెంలో విద్యుత్ చార్జీల బాదుడుపై మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమం జరుగుతుంది. ఉదయం 9 గంటలకు వైఎస్సార్ విగ్రహ కూడలి నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాయకులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ నేతలు, ప్రజలు పాల్గొని పెద్ద ఎత్తున పాల్గొననున్నారు.

ఎస్వీ విద్యార్థుల ర్యాలీ

ఇందుకూరుపేట : జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ అగ్రికల్చర్ విద్యార్థుల ఆధ్వర్యంలో మండలంలోని జగదేవిపేటలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల ఏఓ రఘునాథ్‌రెడ్డి, స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.



సర్వేపల్లికి వచ్చిన యూరియా ఏమైంది?

- రైతుల ఆవేదన

వెంకటాచలం : మండలంలోని సర్వేపల్లి గ్రామ రైతులు యూరియా కావాలని కోరడంతో వ్యవసాయశాఖ అధికారులు ఒక లారీ లోడు యూరియా (400 బస్తాలు)ను సర్వేపల్లి రైతు సేవా కేంద్రానికి ఈనెల 24న పంపారు. అయితే స్థానికంగా ఉన్న ఓ టీడీపీ నేత ఆ యూరియా లోడును మనుబోలు మండలానికి తరలించేసుకున్నాడు. దీనివల్ల యూరియా కోసం వెళ్లిన రైతులకు రైతు సేవా కేంద్రం సిబ్బంది స్టాక్ లేదని చెబుతున్నారు. గ్రామానికి వచ్చిన యూరియా ఏమైందని రైతులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. తమకు పంపిణీ చేయకుండా టీడీపీ నేత ఒక్కరికే ఎలా ఇస్తారని స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మండల వ్యవసాయాధికారి హరికరుణాకర్‌రెడ్డిని వివరణ కోరగా తనకు సమాచారం లేదని తెలిపారు.

తెలుగు మహాసభలకు బుచ్చి ఉపాధ్యాయుడు

బుచ్చిరెడ్డిపాళెం : ఈనెల 27వ తేదీ నుంచి రెండు రోజుల పాటు విజయవాడలో జరిగే ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, సాహితీవేత్త గండికోట సుధీర్‌కుమార్ పాల్గొననున్నారు. దీంతో ఎంఈఓలు ఎం.దిలీప్‌కుమార్, పీవీ రత్నం, స్నేహితులు గురువారం అభినందనలు తెలిపారు.

ఆగని చికెన్ వ్యర్థాల సరఫరా

- రాత్రిళ్లు యథేచ్ఛగా తరలింపు
- తాజాగా మరో రెండు వాహనాల పట్టివేత
- ఎమ్మెల్యే ఆదేశించినా అమలు అంతంతే


వాహనంలోని డ్రమ్ముల్లో చికెన్ వ్యర్థాలు

కొడవలూరు : చేపల గుంతలకు చికెన్ వ్యర్థాల సరఫరా ఆగడం లేదు. వీటిపై నిషేధమున్నా చికెన్ వ్యర్థాలతో వస్తున్న వాహనాలు తరచూ పోలీసులకు పట్టుబడుతూనే ఉన్నాయి. తాజాగా గురువారం కూడా కొడవలూరు పోలీసులు మండలంలోని పద్మనాభసత్రంలో రెండు వాహనాలను పట్టుకున్నారు. చికెన్ వ్యర్థాల తరలింపును పూర్తిగా నిలిపి వేయాలని స్థానిక ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆదేశించినా అమలు అంతంత మాత్రంగా ఉండడం గమనార్హం.

ఇబ్బడిముబ్బడిగా చేపల గుంతలు

కోవూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో చేపల గుంతలు ఇబ్బడి ముబ్బడిగా ఉన్నాయి. వీటికి చెన్నై నుంచి వచ్చే చికెన్ వ్యర్థాలను ఆహారంగా వాడడం అలవాటు. అయితే ఇవి దుర్వాసనతో కూడుకున్నవి కావడం, గ్రామాల మీదుగా తరలిస్తుండడంతో ప్రజలు దుర్గంధంతో అల్లాడిపోతున్నారు. ఒకసారి చికెన్ వ్యర్థాల వాహనం గ్రామం మీదుగా వెళ్లిన తరువాత గంట పాటు దుర్వాసన వీడడం లేదు. అంతేకాకుండా ఈ వ్యర్థాలు రోజుల తరబడి నిల్వ ఉన్నవి కావడంతో కుళ్లిపోయి ఉంటున్నాయి. వీటిని చేపలకు ఆహారంగా వేయడం వల్ల అదే చేపలను తింటున్న వారికి కూడా రోగాలు సోకుతున్నాయంటున్నారు. వీటి వల్ల ఇంతటి దుష్పరిణామాలున్నా తక్కువ ఖర్చుతో చేపలకు ఆహారం వస్తుండడంతో వినియోగిస్తున్నారు. వీటిని అరికట్టాల్సిన వారు కూడా నెలసరి మామూళ్లతో చూసిచూడనట్లు వ్యవహరిస్తూ వచ్చారు. వీటి సరఫరా పెద్ద వ్యాపారంగా మారి గ్రామాల్లో ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారిన నేపథ్యంలో పలు గ్రామాల వారు స్థానిక ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి మొరపెట్టుకున్నారు. వెంటనే ఆమె చికెన్ వ్యర్థాల సరఫరాను నిలిపి వేయాలని ఆదేశించినా చేపల సాగుదారులు నవంబరు ఆఖరు వరకు గడువు అడిగారు. వారి అభ్యర్థన కూడా పరిగణనలోకి తీసుకొని డిసెంబర్ ఒకటి నుంచి నిలిపి వేయాలని సడలింపు ఇచ్చారు. డిసెంబర్ ఒకటో తేదీ నుంచి వ్యర్థాలను తరలిస్తే కఠినంగా వ్యవహరించాలని పోలీసులను కూడా ఎమ్మెల్యే ఆదేశించారు.

ఆగని సరఫరా

కాసులకు అలవాటు పడిన వ్యాపారులు ఎంతకీ చికెన్ వ్యర్థాల సరఫరాను నిలిపివేయడం లేదు. ఈనెలలోనే కోవూరు, కొడవలూరు పరిధిలో మొత్తం ఆరు వాహనాలను పట్టుకున్నారు. జిల్లాకు చెందిన వాహనదారులు వ్యర్థాల తరలింపునకు వాహనాలను పంపడం లేదు. దీంతో తమిళనాడుకు చెందిన వాహనాలతో రాత్రి వేళల్లో తరలింపునకు శ్రీకారం చుట్టారు. పోలీసులు చేపల గుంతల వద్ద తనిఖీలు చేసినప్పుడల్లా వాహనాలు పట్టుబడుతూనే ఉన్నాయి. కాకుంటే గతంలో పగటిపూట నిరాటంకంగా తరలిస్తుండగా, ఇప్పుడు కేవలం రాత్రి వేళల్లో మాత్రమే తరలిస్తున్నారు.

తాజాగా..

కొడవలూరు ఎస్సై కోటిరెడ్డి గురువారం ఉదయం పద్మనాభసత్రంలోని చేపల గుంతల వద్ద తనిఖీలు చేయగా బుధవారం రాత్రి ఇక్కడికి వచ్చిన రెండు చికెన్ వ్యర్థాల లారీలు ఉన్నట్లు గుర్తించి పట్టుకున్నారు. తనిఖీలు నిర్వహించిన సందర్భాల్లో వ్యర్థాల వాహనాలు పట్టుబడుతూనే ఉన్నాయి. మొక్కుబడిగా కాకుండా నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ కఠినంగా వ్యవహరిస్తే తప్ప వీటిని అడ్డుకోవడం కష్టమనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.


పద్మనాభసత్రంలో పట్టుబడిన వ్యర్థాల వాహనం

నిత్యాన్నదానానికి విరాళం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి భక్తులు గురువారం భారీగా విరాళాలు అందించారు. ఏఎస్‌పేట మండలం గంపర్లపాడుకు చెందిన సుబ్బారెడ్డి రూ.6,25,000, నెల్లూరు నగరానికి చెందిన కొమ్మి మల్లికార్జుననాయుడు రూ.1,60,000లను అందజేశారు. ఆలయ ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.